## క్లుప్తంగా

### నేడు వైఎస్సార్ వర్ధంతి

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆదేశాల మేరకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 15వ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ,మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, డి.రాజమోహన్‌రెడ్డి ఆదివారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### కొనసాగుతున్న నీటి విడుదల



లింకు చానల్ ద్వారా వీబీఆర్ లోకి వస్తున్న కృష్ణా జలాలు

వెలుగోడు: తెలుగుగంగ ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు భానక్కచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్‌చానల్ ద్వారా 11,500 క్యూసెక్కులు కృష్ణ జలాలు వచ్చి చేరుతున్నాయి. వీబీఆర్ పూర్తిస్థాయి నీటిమట్టం 16.95 టీఎంసీలు కాగా ఆదివారం 14.935 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మద్రాసు కాలువకు 5వేలు, స్పిల్ వే ద్వారా గాలేరుకు 6,500 క్యూసెక్కులు, వన్ ఆర్ తూముకు 10 క్యూసెక్కులు, నంద్యాల తాగునీటి అవసరాలకు 10 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని తెలుగు గంగ ఏఈ శివ నాయక్ తెలిపారు.

### నూతన కమిటీ ఎన్నిక

ఆత్మకూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షులు జి.గోవిందు అధ్యక్షతన తాలూకా ఎన్నికల అధికారి పి.దుర్గాకుమార్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తాలూకా అధ్యక్షుడిగా ఎస్.నూర్‌బాషా, ఉపాధ్యక్షులుగా ఎస్.చాంద్‌బాషా, కనకం సోమన్న, సెక్రటరీగా షేక్ జాకీర్‌బాషా, జాయింట్ సెక్రటరీలుగా హుసేన్‌బాషా, పి.ఆదిలక్ష్మీబాయి, ట్రెజరర్‌గా మోహన్‌కుమార్‌ను ఎన్నుకున్నారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఆత్మకూరు: కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు రోగాలబారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి గోపాల్ సూచించారు. ఆదివారం బైర్లూటీ ఆసుపత్రి పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ వైద్య సిబ్బందితో వెళ్లి ప్రజలతో మాట్లాడారు. కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలు కలుషితమైన నీటిని తాగి రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. నీటిని కాచి చల్లార్చి తాగాలన్నారు. రాత్రివేళల్లో దోమతెరలను వాడాలని సూచించారు. సీహెచ్‌ఓ దీపికా బాయి, యశోదబాయి ఉన్నారు.

### ముగిసిన గణపతి గాథలు ప్రవచనాలు

శ్రీశైలంటెంపుల్: విఘ్నసంహారకుడిగానే కాకుండా సర్వాభీష్టాలను తీర్చే దైవంగా గణపతి పేరొందారని ప్రముఖ ప్రవాచకులు సామవేదం షణ్ముఖశర్మ తెలిపారు. హిందూ ధర్మ ప్రచారములో భాగంగా శ్రీశైల దేవస్థానం తొమ్మిదిరోజుల పాటు గణపతి గాథలపై నిర్వహించిన ప్రవచనాలు ఆదివారం ముగిశాయి. ఈ ప్రవచనాల్లో సందర్భానుసారంగా శ్రీశైల క్షేత్ర మహిమ, విశేషాలు, వేదసంస్కృతి, సనాతన ధర్మం, ఆచారాలు, సంప్రదాయాల గురించి కూడా వివరించారు. అనంతరం ప్రవచనకర్తను ఈఓ ఘనంగా సత్కరించి స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు, జ్ఞాపిక అందజేశారు.

### తెలంగాణ మద్యం విక్రయిస్తే క్రిమినల్ కేసులు



పట్టుబడిన మద్యం చూపుతున్న సీఐ, ఎస్‌ఐ

నందికొట్కూరు: తెలంగాణ మద్యం విక్రయిస్తే క్రిమినల్ తప్పవని రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్‌లో పట్టుబడిన 152 తెలంగాణ మద్యం బాటిళ్లను రూరల్ సీఐ, ఎస్‌ఐ తిరుపాలు విలేకరులకు చూపించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు శాతనకోట గ్రామ సమీపంలో కేసీ కెనాల్ వెంట బైక్‌పై వెళ్తున్న చందమాల తిరుపాలు, ఏకదంతాలును అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొస్తే క్రిమినల్ కేసులు, పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

### నేడు పాఠశాలలకు సెలవు

నందికొట్కూరు/జూపాడుబంగ్లా: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సోమవారం ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిందని ఎంఈఓలు సుభాన్, చిన్నమద్దిలేటి తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఎటువంటి పరిస్థితుల్లోనూ తరగతులు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

### రైతులు అప్రమత్తంగా ఉండాలి

వెలుగోడు: వర్షాలు కురుస్తున్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని బోయరేవుల, మోత్కూరు గ్రామాల్లో ఆదివారం పర్యటించి వరి పొలాలు పరిశీలించి, పంటలు నీటి ముంపునకు గురైతే తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. మండలంలో రెండు రోజుల్లో 105 ఎం.ఎం. వర్షపాతం నమోదైందని చెప్పారు.





ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి నది, వెలుగోడు వద్ద వరి పంటను ముంచెత్తిన వర్షపు నీరు



ఆత్మకూరు ఇందిరానగర్ కాలనీలో ప్రవహిస్తున్న వరదనీరు,



భవనాశి, సుద్దవాగు ఏకమవ్వడంతో రహదారి పైకి చేరిన నీరు

# భారీ వర్షం

- భారీ వర్షంతో పట్టణ శివారు కాలనీలు జలమయం
- భవనాశి పొంగి పొర్లడంతో జలదిగ్బంధంలో ఆత్మకూరు, కొత్తపల్లె మండలాలు
- కర్నూలు – గుంటూరు ఘాట్ రోడ్డు మూసివేత
- ముందస్తు సమాచారం లేక ఇక్కట్లలో ప్రయాణికులు
- రంగంలోకి ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందం
- పర్యవేక్షించిన డీఎస్పీ రామాంజినాయక్
- సిద్ధాపురం చెరువుకు 12 అడుగుల నీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న భవనాశి నది

ఆత్మకూరురూరల్: మండలంలో సుమారు 10 సెం.మీ. భారీ వర్షం కురవడంతో ఆదివారం తెల్లవారుజామున భవనాశి పొంగి పొర్లింది. దీంతో కొత్తపల్లె, ఆత్మకూరు మండలంలోని ఉత్తరం పల్లెలకు బయటి ప్రపంచంతో సంభంధాలు తెగిపోయాయి. బ్రిడ్జీల మీద ఛాతీ ఎత్తులో వరదన నీరు పారుతుండడంతో భవనాశి ఉధృతిలో ఏ వాహనం వెళ్లేందుకు సాహసించలేదు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఆత్మకూరు డీఎస్పీ రామాంజి నాయక్ తన సిబ్బందిని బ్రిడ్జిల వద్ద, కల్వర్టుల వద్ద కాపలా ఉంచారు. జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశాల మేరకు మండలానికి ఒక ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని అందుబాటులో ఉంచారు.

**ఘాట్‌రోడ్ మూసివేత..**

కర్నూలు – గుంటూరు ప్రధాన రహదారిని ఆత్మకూరు పోలీసులు మూసివేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో అడవిలో ప్రమాదం జరిగే అవకాశమున్నందున ఆత్మకూరు పట్టణంలోని నంద్యాల క్రాస్ వద్ద స్టాపర్స్, బారికేడ్‌లు పెట్టి ట్రాఫిక్‌ను నంద్యాల ,గిద్దలూరు మీదుగా మళ్లించారు. భారీ వర్షాలకు కొండ చరియలువిరిగి పడే ప్రమాదముందని పోలీసులు ఈ చర్యలు చేపట్టరు. అయితే ముందస్తు సమాచారం లేనందున ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా కర్ణాటక, మహారాష్ట్ర లనుంచి వచ్చిన యాత్రికులు దారి తెలియకపోవడం, చుట్టూ తిరిగి రావాల్సి రావడం వంటి సమస్యలతో ఇబ్బందులు పడ్డారు. మండలంలోని ఏకైక భారీ మధ్యతరహా సాగునీటి ప్రాజెక్ట్ శివభాష్యం సాగర్ (వరదరాజస్వామి ప్రాజెక్ట్) నాలుగు గేట్లను ఎత్తి ఇరిగేషన్ అధికారులు ఆదివారం నీటిని కిందికి వదిలారు. నల్లమలలో భారీ వర్షం కురవడంతో కొండవాగైన మునిమడుగులేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో శివభాష్యం సాగర్‌కు వరద పోటెత్తింది. వరద ఉధృతిని పరిశీలించిన అధికారులు ప్రాజెక్‌కు ఉన్న నాలుగు గేట్లను ఎత్తి నీటి విడుదల చేశారు. ఇప్పటికే ఈ ప్రాజెక్ట్ కింద ఉన్న గొలుసుకట్టు చెరువలన్నీ పూర్తి స్థాయిలో నిండి అలుగులు పారుతున్నాయి. దీంతో ఈ నీరంతా భవనాశిలోకి చేరి వరదగా మారింది. భవనాశి వరదతో కొత్తపల్లె మండలానికి బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. అధికారులు పరిస్థితిని సమీక్షిస్తున్నారు.

**కూలిన భారీ వృక్షాలు..**

ఆత్మకూరులోని మార్కెట్ యార్డు సమీపంలో ఆదివారం యూకలిప్టస్ చెట్టు, స్థానిక నీలి తొట్ల వీధిలో మదోక భారీ వృక్షం నేల కూలి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలిగించాయి. డీఎస్పీ రామాంజి నాయక్ ఆయా ప్రాంతాలకు వెళ్లి సంబంధిత అధికారులతో మాట్లాడి చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టారు. రూరల్ సీఐ సురేష్ కుమార్ రెడ్డి, ఎస్‌ఐ నారాయణ రెడ్డి సహాయ కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: మండల కేంద్రమైన సున్నిపెంటలో 118 మి.మీ. వర్షం కురిసింది. ఆంజనేయస్వామి గుడి సమీపంలో భారీ వృక్షం కూలి రెండు గృహాలపై పడింది.

**నిండిన వరదరాజస్వామి ప్రాజెక్ట్**

ఆత్మకూరు: శుక్రవారం పట్టణంలో 31.6 మి.మీ., శనివారం 86.3 మి.మీ. వర్షం కలిపి కేవలం రెండు రోజుల్లోనే 100 మి.మీ. వర్షం కురవడం, నల్లమలలో విస్తారంగా కురవడం వల్ల బవనాసి, గుండ్లకమ్మ, సుద్దవాగులు ఉప్పొంగి పొర్లాయి. వరదరాజస్వామి ప్రాజెక్టు నిండడం వల్ల అధికారులు నాలుగు గేట్లను ఎత్తారు. అయితే అప్పటికే బవనాసి, సుద్దవాగుల్లో వరదప్రవాహం అధికంగా ఉండడంతో వరదరాజుస్వామి ప్రాజెక్టు నీరు కలవడంతో నదులు పోటెత్తాయి. ఫలితంగా ఆత్మకూరుకు వరదనీరు పోటెత్తింది. అలాగే..ఆత్మకూరు, కొత్తపల్లి, పాములపాడు మండలాలకు రాకపోకలు స్తంభించాయి. దాదాపు కొత్తపల్లి, పాములపాడు, ఆత్మకూరు మండలాల్లోని దాదాపు 25 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడమేగాకుండా ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపివేశారు. సోమవారం వరద ఉధృతి తగ్గితే తప్పా బస్సు సర్వీసులను నడపలేమని డీఎం మహేంద్రుడు తెలిపారు. శ్రీశైలం క్షేత్రానికి కూడా ఆత్మకూరు డీయస్పీ రామంజినాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నుంచి కర్నూలు-గుంటూరు రహదారిలోని నల్లమల వెంట బస్సుల రాకపోకలను నిలిపివేశారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి శ్రీశైలం క్షేత్రానికి ఆత్మకూరు నుంచి నల్లమల ఘాట్ రోడ్డు మీదుగా బస్సులను అనుమతించారు. వరదరాజస్వామి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండడంతో మండల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



భవనాశి వద్ద పోలీసుల పహారాను పర్యవేక్షిస్తున్న డీఎస్పీ,



ఇళ్లపై కూలిన వృక్షం

**350 ఎకరాల్లో పంట నష్టం**

వెలుగోడు: భారీ వర్షాల కారణంగా మండలంలో వరి పంటకు 350 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని ఏవో పవన్ కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పెద్ద మల్లాలమ్మ, చిన్న మల్లాలమ్మ, చెవిటి మల్లమ్మ చెరువులు నిండి అలుగు ప్రవహించడంతో సమీపంలోని వరి పంటను ముంచెత్తింది. జాబితా తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని చెప్పారు.



ఇస్కాల గ్రామంలో ఎస్సీ కాలనీలోకి చేరిన నీరు



రాయలచెరువులో నీటమునిగిన వరి



ముసలిమడుగు గ్రామంలో ఎడతెరిపిలేని వర్షాలకు నేలకొరిగిన విద్యుత్‌స్తంబాలు



తాటిపాడులో ఇంట్లోకి చేరిన వర్షం నీటిని తోడిపోస్తున్న మహిళ



నేలగండి వాగు వద్ద టీడీపీ నాయకుడు నిర్మించిన చెక్‌డ్యాం

# వర్షం ధాటికి ప్రజలు విలవిల



చెలిమిల్ల గ్రామం వద్ద నీట మునిగిన మొక్కజొన్న పైరు

పాములపాడు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షం ధాటికి ప్రజలు విలవిల్లాడి పోతున్నారు. ఆదివారం మండలంలో 76.6మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మండలంలోని వాగులు, వంకలు ఏకమై పొంగి పొర్లి ప్రవహిస్తున్నాయి. ప్రధానంగా పాములపాడు-చెలిమిల్ల గ్రామాల మధ్యన భవనాశి, సుద్ద వాగులు ఏకమయ్యాయి. వంతెన పై నుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో చెలిమిల్ల, లింగాల గ్రామ ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే కంబాలపల్లి-ఇస్కాల గ్రామాల మధ్యన భవనాశి వాగు ఉధృతికి ఆ గ్రామ ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. వాగు పరివాహక ప్రాంతాలైన చెలిమిల్ల, లింగాల, ఇస్కాల, పాములపాడు, బానకచెర్ల గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి. బానుముక్కల, ఇస్కాల గ్రామాల్లోని లోతట్టు కాలనీల్లోకి, ఇల్లలోకి నీరు చేరాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నడూలేని విధంగా కంబాలపల్లి గ్రామ సమీపంలోని ఎస్‌ఆర్‌ఎంసీ కాలువ పై ఉన్న సూపర్‌ప్యాజేజ్ వంతెన పై నీరు ప్రవహిస్తోంది. మండలంలో వర్షం వల్ల మొక్కజొన్న 1300 హెక్టార్లు, మినుము 80హెక్టార్లు, సోయాబిన్ 80హెక్టార్లు, మిరప 40హెక్టార్లలో నీట మునిగినట్లు వ్యవసాయ అధికారి ఫణీశ్వరరెడ్డి తెలిపారు.

**కుండపోత వర్షం**

కొత్తపల్లి: దుద్యాల సమీపంలోని కుమ్మరికుంట వాగు, భవాసి వాగులు ఉప్పొంగడంతో గ్రామంలోని ముస్లిం కాలనీ ఇతర కాలనీల్లోని ఇళ్లలోకి వర్షపునీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దుద్యాల నుంచి ఆత్మకూరు పట్టణానికి వెళ్లేదుకు వీలులేనంతా రోడ్డుపై నీరు పారుతుంది. నీటి ప్రవాహానికి రెండు బైకులు కొట్టుకోపోతుంటే స్థానికులు వెంటనే వాటిని లాగి ఎటువంటి ప్రమాదం జరగకుండా నిలువరించారు. శివపురం, లింగాపురం గ్రామాల మధ్య ఎద్దులేరు వాగు మరి తీవ్రరూపం దాల్చడంతో రాకపోకలు నిలిచి పోయాయి. లింగాపురం కొత్త మాడుగుల రహదారి మధ్యలో నల్లవాగు ఉధృతంగా పారుతోంది. గోకవరం, ఎదురుపాడు గ్రామాల మధ్య రాకపోకలకు ఆంతరాయం ఏర్పడంది. ఎటుచూసిన నీరు చేరడంతో మండలానికి ఆత్మకూరు పట్టణం నుంచి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ముసలిమడుగు గ్రామంలో బేతేశ్వర ఆలయం సమీపంలో విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అన్ని గ్రామాలలో మొక్కజొన్న, పత్తి, వరి, మిరప, మినుము పంటలు నీటమునిగాయి. వీరాపురం, గువ్వలకుంట్ల సమీపంలో వరిపొలాలు చెరువులను తలపిస్తున్నాయి. ఆదివారం మండలంలో 40.6 మి.మీల వర్షపాతం నమోదు అయినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

**నీట మునిగిన పంటలు**

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు అన్ని గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా రెండు రోజుల నుంచి కుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. మండలంలో సాగు చేపట్టిన కొర్ర, పచ్చిమిరప, ఉల్లిగడ్డ, పత్తి తదితర పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వర్షాలకు ముందుగా నాటుకున్న పొగాకు పూర్తిగా దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 60.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వర్షాల ధాటికి మండల కేంద్రంలని చాకలిపేటకు చెందిన చాకలి దేవన్న కుమారుడు శ్రీనివిసులు మట్టి మిద్దె పైకప్పు కూలింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

**టీడీపీ నాయకుడి నిర్వాకంతో 500 ఎకరాలు నీట మునక**

పగిడ్యాల: ఎడతెరిపి లేని వర్షాలకు ఆదివారం రాయలచెరువు వాగు, నల్లవాగు, నేలగండి వాగులు పొంగి ప్రవహించాయి. లోతట్టు పొలాలు జలమయమయ్యాయి. దీంతో మొక్కజొన్న, మినుము, కొర్ర, తదితర పంటపొలాల్లో నీరు నిల్వ ఉండి దెబ్బతిన్నాయి. పడమర ప్రాతకోట నేలగండి వాగు వద్ద ఓ టీడీపీ నాయకుడు నిర్మించిన చెక్‌డ్యాం కారణంగా రాయలచెరువులోని దాదాపు 500 ఎకరాలు జలయమయ్యాయి. లక్ష్మాపురం, పగిడ్యాల, పడమర ప్రాతకోటలోని ఎస్సీ, బీసీ రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. చెక్‌డ్యాం కారణంగా ప్రతి ఏటా తమ పంట పొలాలు ముంపుకు గురవుతున్నాయని వాపోతున్నారు.

**అతలాకుతలమైన జనజీవనం...**

జూపాడుబంగ్లా: రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో మండలంలోని వివిధ గ్రామాల్లో జనజీవనం అతలాకుతలమైంది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మండలంలో 87.6మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. వర్షాల వల్ల మండలంలోని తాటిపాడు, తరిగోపుల, తంగడంచ, భాస్కరాపురం, 80బన్నూరు, మండ్లెం, తర్తూరు, పి.లింగాపురం తదితర గ్రామాల్లోని నివాసగృహాల్లోకి వర్షం నీరు చేరటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. మట్టిమిద్దెలు వెలుస్తుండటంతో ఇళ్లల్లో తలదాచుకోలేక ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. తరిగోపుల గ్రామంలో కుర్వ శ్రీనివాసులు అనే వ్యక్తి మిద్దెకూటంతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకొన్నారు. మండలంలోని ఇసుకవాగు, కాకిలేరువాగు, సుద్దవాగు పొంగిపొర్లాయి. మండలంలోని తాటిపాడు, తంగడంచ, తర్తూరు, మండ్లెం, పారుమంచాల, తూడిచెర్ల, 80బన్నూరు, తరిగోపుల, పి.లింగాపురం తదితర గ్రామాల్లో రెండురోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల 674హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు ఏఓ కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు.

**పంటలకు తీవ్ర నష్టం**

నందికొట్కూరు: రెండు రోజుల పాటు ఎడతెరిపి లేని వర్షాలు కురిశాయి. నందికొట్కూరు మండలంలో మొక్కజొన్న పంట దాదాపు -250 హెక్టార్లు, మినుము- 50 హెక్టార్లలో నష్టం జరిగిందని అధికారుల అంచనా. మిడుతూరు మండలంలో కొర్ర-150 హెక్టార్లు, మిరప-100, సోయాబిన్-25, పత్తి-80 హెక్టార్లు, కొత్తపల్లి మండలంలో మొక్కజొన్న 900 హెక్టార్లు, మినుము-200 హెక్టార్లు, పత్తి-120 హెక్టార్లు పంటలు దెబ్బతిన్నాయి. ఇదిలా ఉండగా నందికొట్కూరు పట్టణంలో రోడ్లపై వర్షపునీరు నిలిచింది. పట్టణంలోని మారుతీనగర్, హాజీనగర్, సాయిబాబాపేట, ప్రధాన రహదారుల్లో వర్షపు నీరు నిలిచింది.



వర్షం ధాటికి నేలకొరిగిన కొర్రపంట


### మట్టిమిద్దెల్లో అప్రమత్తంగా ఉండండి



మట్టిమిద్దెలున్న వారితో మాట్లాడుతున్న డీపీఓ మంజులవాణి

జూపాడుబంగ్లా: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల మట్టిమిద్దెలు కూలే ప్రమాదం ఉన్నందున మట్టిమిద్దెల్లో నివాసం ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని డీపీఓ మంజులవాణి సూచించారు. ఆదివారం ఆమె బ్రాహ్మణకొట్కూరు, బొల్లవరం, తాటిపాడు, రుద్రవరం గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆమె తాటిపాడు గ్రామానికి చేరుకొని శ్రీశైలం బ్యాక్‌వాటర్ నీటి మట్టాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె గ్రామంలోని మట్టిమిద్దెలను పరిశీలించి అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తూ వారికి పంచాయతీ కార్యదర్శి శాంతయ్య ద్వారా నోటీసులు అందజేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ కురుస్తున్న వర్షాల ధాటికి గ్రామాల్లో ఎక్కడా తాగునీరు కలుషితం కాకుండా పంచాయతీ కార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎగువ ప్రాంతాల నుంచి కృష్ణానదిలోకి వరదనీటి ప్రవాహం అధికంగా కొనసాగుతున్నందున తీరప్రాంత గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మట్టిమిద్దెలున్న వారు వాటిల్లో నిద్రించకుండా గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో నిద్రించాలని సూచించారు. సర్పంచ్ వంగల లక్ష్మీదేవమమ్మ, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, వంగల కృష్ణారెడ్డి, లక్ష్మన్నగౌడు ఉన్నారు.

### రైతులకిచ్చిన హామీలు నెరవేర్చాలి



నందికొట్కూరులో సీపీఐ రైతు సంఘం జెండాను ఎగరవేస్తున్న నాయకులు

నందికొట్కూరు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించిందని సీపీఐ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని వాల్మీకి నగర్ పగిడ్యాల రోడ్డుసెంటర్‌లో రైతాంగ డిమాండ్స్ డే సందర్భంగా సీపీఐ రైతు సంఘం జెండాను రైతు సంఘం సీనియర్ నాయకులు దాదాబాషా, వెంకటేశ్వర్లు ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పరిశ్రమలను, గనులు, విద్యుత్, అటవీ సంపదను, రవాణా, బ్యాంకులు, ఎల్ఐసీతో పాటు మరిన్ని సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుధాకర్, కృష్ణ, శివకుమార్, రామకృష్ణ, సోమన్న, తిరుపాలు, కేశవగౌడు తదితరులు పాల్గొన్నారు.

**రైతులకు పెట్టుబడి సాయం అందజేయాలి**

జూపాడుబంగ్లా: సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రైతులకు రూ.20వేల పెట్టుబడి సహాయం మంజూరు చేయాలని ఏపీ వ్యవసాయసంఘం నాయకుడు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రమైన జూపాడుబంగ్లాలో రైతు సంఘం జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో ఏసన్న, లింగన్న, ప్రసాద్, అన్వర్, తిరుపాలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### హైలెవెల్ వంతెన నిర్మించాలి

కొత్తపల్లి: శివపురం, లింగాపురం గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగుపై లోలెవెల్ వంతెనకు బదులుగా హైలెవల్ వంతెనను నిర్మించాలని సీపీఎం మండల నాయకులు ఎన్ స్వాములు, ఎస్ సంజీవరాయుడు ఆదివారం డిమాండ్ చేశారు. పెద్దవాగుపై నీళ్ల వచ్చిన ప్రతిసారి ప్రజా ప్రతినిధులు పరిశీలించి మాటలతో కాలం గడుపుతున్నారే తప్ప బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టడం లేదన్నారు.

### ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు



బానుముక్కలలో ఇళ్లలోకి నీరు చేరిన బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

పాములపాడు/కొత్తపల్లి: వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. ఆదివారం పాములపాడు మండలంలోని పాములపాడు, బానుముక్కల, ఇస్కాల, కొత్తపల్లి మండలంలోని దుద్యాల,నందికుంట, ఎం. లింగాపురం, శివపురం గ్రామాల్లో పర్యటించారు. నీట మునిగిన పంట పొలాలను, కాలనీలను సందర్శించి ప్రజలతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడుతున్న వారిని వెంటనే సురక్షిత ప్రదేశానికి తరలించి వారికి భోజన సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ గోపీక్రిష్ణ, టీడీపీ నాయకులు హరినాథరెడ్డి, వాడాల జనార్దన్‌రెడ్డి, నబిరసూల్, గోవిందు తదితరులు ఉన్నారు.

### పీహెచ్‌సీలో నెలకు నాలుగు కాన్పులు చేయాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ

జూపాడుబంగ్లా: ప్రతి ప్రాథమిక వైద్యకేంద్రంలో నెలకు తప్పనిసరిగా నాలుగు కాన్పులు చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. ఆదివారం ఆయన జూపాడుబంగ్లా ప్రాథమిక వైద్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన ముందుగా సిబ్బంది హాజరుపట్టికను పరిశీలించి విధులకు ఎవ్వరెవ్వరు హాజరయ్యారని ఆరాతీశారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ ఆసుపత్రిని ఇరుకుగదుల్లోంచి విశాలమైన నూతన భవనంలోకి మార్చినందున కచ్చితంగా నెలకు నాలుగు కాన్పులు చేయాలని డాక్టర్ గంగాధర్‌ను ఆదేశించారు. కాన్పులతో పాటు ఆసుపత్రిలో అవసరమైన పరికరాల ఇండెంట్ పంపితే వాటిని త్వరగా మంజూరు చేయిస్తామన్నారు. అధికవర్షాలు కురుస్తున్నందున అంటువ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయని, ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో డీఎంఅండ్‌హెచ్‌ఓ మొక్కను నాటారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాముడు పాల్గొన్నారు.

### విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వార్డెన్లపై చర్యలు

నంద్యాల(అర్బన్): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాజకుమారి హెచ్చరించారు. సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో సదుపాయాలపై ఆదివారం జిల్లా కలెక్టర్ ఆరా తీశారు.ఇందులో భాగంగా పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల వసతి గృహాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. 1వ వసతి గృహంలో 215 మంది విద్యార్థులకు 21.5 కిలోల చికెన్ కూర ఇవ్వాల్సి ఉండగా 8.5 కిలోల చికెన్ మాత్రమే ఇవ్వడం, 2వ వసతి గృహంలో చికెన్‌కు బదులుగా టమాట కూర తయారు చేయడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఇరువురు సంక్షేమ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన మెనూను పాటించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అనంతరం సమీపంలోని బీసీ బాలికల హాస్టల్‌ను తనిఖీ చేసి పిల్లలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు.

### నిప్పులవాగుకు 2,010 క్యూసెక్కుల నీరు

జూపాడుబంగ్లా: లాకిన్స్‌లా నుంచి నిప్పులవాగుకు 2,010క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. సుంకేసుల డ్యాం నుంచి కేసీ కాల్వకు 2,500క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తుండగా లాకిన్స్‌లా వరకు 2,122 క్యూసెక్కుల నీరు చేరుతున్నట్లు తెలిపారు. ఈ నీటిని నిప్పులవాగుకు 2,010క్యూసెక్కులు, తూడిచెర్ల సబ్‌ఛానల్‌కాల్వకు 57క్యూసెక్కులు, ఏబీఆర్ కాల్వకు 55క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు వివరించారు.